# ప్రజా మారుతి
తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు


అధికారంలో లేకున్నా తగ్గని జోరు..
బీఆర్ఎస్ పార్టీకి పెరిగిన విరాళాలు


ప్రచురణ : జగిత్యాల | సంపుటి : 07 | సంచిక : 33 | బుధవారం | 30 - 09 - 2026 | పేజీలు : 04 | వెల రూ. 2


## క్యూర్ పరిధిలో మరో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన

- రూ.43.20 కోట్ల నిధులతో నిర్మాణం
- నాంపల్లి నియోజకవర్గంలోని రెడ్‌హిల్స్‌లో ఇందిరమ్మ టవర్‌కు మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు
- లబ్ధిదారులకు ఫ్లాట్ల కేటాయింపు పత్రాలను మంత్రి అందజేశారు
- నాంపల్లిలో రూ.43.20 కోట్ల నిధులతో ఎల్ఐజీ ఫ్లాట్ల టవర్ నిర్మించనున్నారు



**హైదరాబాద్ :** క్యూర్ పరిధిలోని 20 నియోజకవర్గాల్లో త్వరలోనే టెండర్లు పిలిచి ఇందిరమ్మ టవర్ల నిర్మాణం ప్రారంభిస్తామని గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తోందన్నారు. నాంపల్లిలో 480 ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు భూమి పూజ చేసిన పొంగులేటి పేద ప్రజల జీవిత కల సాకారం చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.క్యూర్ పరిధిలో 20 నియోజకవర్గాల్లో ఇప్పటికే భూములను గుర్తించాం. సుమారు 16 నుంచి 17 ప్రాంతాల్లో టెండర్లు పూర్తి చేశాం. రేపటి నుంచి ఇక్కడ పనులు కూడా కాంట్రాక్ట్?? చేయడానికి రెడీగా ఉన్నారు. సిటీకి గతంలో నివసించిన ప్రాంతానికి 30-40 కి.మీ దూరంలో అనాటి ప్రభుత్వం అరకొర ఇండ్లు నిర్మించిన మాట వాస్తవం. 40 కి.మీ దూరంలో ఈ పేదవారు అక్కడ నివసిస్తే, వారు అక్కడ జీవనోపాధి కోసం ఏ పని చేసుకుంటారో? లేదో? అని కూడా ఆనాటి పెద్దలకు ఆలోచన లేకపోవడం దురదృష్టకరం.నాంపల్లిలోని రెడ్‌హిల్స్‌లో 480 ఇందిరమ్మ ఇండ్లటవర్స్‌కు - మిగతా 2 లో

## నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా



- కేటీఆర్‌కు కవిత స్ట్రాంగ్ వార్నింగ్
- కేటీఆర్ వ్యాఖ్యలపై టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆగ్రహం
- కేసీఆర్‌పై పార్టీ వైఫల్యాలు నెడుతున్నారంటూ విమర్శలు
- కేటీఆర్ తీరు పార్టీ వ్యతిరేకం కాదా అంటూ నిలదీత
- రైతు, మహిళ పట్ల వ్యాఖ్యలపై కేటీఆర్‌పై విమర్శలు

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ వైఫల్యాలను, చేతగానితనాన్ని కేసీఆర్‌పై నెట్టడం ఏంటని ప్రశ్నించారు. గుంటనక్క మైండ్‌గేమ్‌లో పడి - మిగతా 2 లో

## అదుపుతప్పి మాట్లాడితే మహిళలతో కొట్టిస్తా



- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ
- నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో కొట్టిస్తానన్న కొండా సురేఖ
- వరంగల్‌లో ప్రతిపక్ష నేతలకు, పార్టీలోని కొందరికి హెచ్చరిక
- ప్రతిపక్ష నేతలు గాల్లో కత్తులు తిప్పుతున్నారంటూ వ్యాఖ్య
- కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు పక్కనపెట్టాలని నేతలకు సూచన

**హైదరాబాద్ :** మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ తనదైన శైలిలో రాజకీయ ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం వరంగల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో దేహశుద్ధి చేయిస్తానని ఘాటుగా హెచ్చరించారు.కొంతమంది నేతల తీరుపై - మిగతా 2 లో

## ఆసియా క్రీడల్లో భారత్ కు మరో స్వర్ణం

- రిలేలో విద్యా రామరాజ్ అద్భుత ప్రదర్శన
- ఏషియన్ గేమ్స్ మహిళల 4X400 మీటర్ల రిలేలో భారత్‌కు స్వర్ణం
- కిరణ్ పహల్, పూవమ్మ, ప్రాచి, విద్యా రామ్‌రాజ్‌ల బృందం అద్భుత ప్రదర్శన
- ఉత్కంఠభరితమైన చివరి ల్యాప్‌లో బహ్రెయిన్‌పై విజయం
- యాంకర్ లెగ్‌లో అద్భుతంగా పరుగెత్తి గెలిపించిన విద్యా రామ్‌రాజ్
- ఈ క్రీడల్లో విద్యాకు స్వర్ణం, రజతం, కాంస్యంతో కలిపి ఇది మూడో పతకం




**ఢిల్లీ :** ఆసియా క్రీడల అథ్లెటిక్స్‌లో భారత మహిళల జట్టు స్వర్ణ పతకంతో మెరిసింది. మంగళవారం జరిగిన మహిళల 4ఇ400 మీటర్ల రిలే ఫైనల్లో భారత బృందం అద్భుతమైన ప్రదర్శనతో పసిడిని ముద్దాడింది. కిరణ్ పహల్, ఎం.ఆర్. పూవమ్మ, ప్రాచి, విద్యా - మిగతా 2 లో

## దేశవ్యాప్తంగా 16 ప్రాంతాల్లో ఎన్ఐఏ సోదాలు




- ఆరుగురు అరెస్ట్, కీలక పత్రాలు, ఫోన్లు స్వాధీనం
- ఆరుగురు అనుమానితులను అరెస్ట్ చేసినట్లు చెప్పిన జాతీయ దర్యాప్తు సంస్థ
- ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లతో సహా అనేక పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడి

**ఢిల్లీ :** అసోం, బంగాల్, కేరళ రాష్ట్రాల్లోని 16 ప్రాంతాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ మంగళవారం సోదాలు చేపట్టింది. 'జమాత్-ఉల్-ముజాహిదీన్ బంగ్లాదేశ్'కు అనుబంధంగా ఉన్న 'ఇమామ్ మహ్మూదర్ కఫిలా'కు సంబంధించిన ఉగ్రవాద కుట్ర, అసోంలో యువతను తీవ్రవాద భావజాలం వైపు మళ్లింపుపై ఈ సోదాలు నిర్వహించింది. మొత్తం 16 ప్రాంతాల్లో 10 అసోంలో, 5 బంగాల్‌లో ఒకటి కేరళలో ఉన్నాయి. విచారణ కోసం అసోంలోని బార్పేట జిల్లాకు - మిగతా 2 లో

## భారత రైల్వేలో సరికొత్త ప్రయోగం
## పట్టాలెక్కిన తొలి ఎల్ఎన్‌జీ రైలు

- భారతదేశపు తొలి ఎల్ఎన్‌జీ ఆధారిత రైలు సేవలు ప్రారంభం
- అహ్మదాబాద్‌లో జెండా ఊపి ప్రారంభించిన కేంద్ర మంత్రి అమిత్ షా
- డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్‌తో పనిచేయడం దీని ప్రత్యేకత
- డీజిల్‌తో పాటు ఎల్ఎన్‌జీ వాడకంతో 40శాతం ఇంధనం ఆదా అంచనా
- హైడ్రోజన్ రైలుకు భిన్నమైన టెక్నాలజీతో ఈ రైలు రూపకల్పన




**ఢిల్లీ :** భారతీయ రైల్వే చరిత్రలో మరో కీలక ఘట్టం నమోదైంది. దేశంలోనే తొలిసారిగా ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ)తో నడిచే రైలును ప్రవేశపెట్టారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉన్న సబర్మతి రైల్వే స్టేషన్‌లో ఈ నెల 27న కేంద్ర హోంమంత్రి అమిత్ - మిగతా 2 లో

## బొల్లారం ఆయుధాల చోరీ కేసులో కీలక పరిణామం

- మల్లేశ్‌కు సహకరించింది వారే..!
- మల్లేశ్‌కు గోడౌన్ కీపర్లు సహకరించినట్లు విచారణలో వెల్లడి
- వినోద్, శేషులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మల్లేశ్‌తో భారీ ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తింపు
- మల్లేశ్ ఇంట్లో ఆయుధాలు, బుల్లెట్ల స్వాధీనం
- సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ కోసం రెజిమెంట్‌కు మల్లేశ్ తరలింపు

2 లో..



## వైసీపీ నేత కాకుమాను కుటుంబానికి జగన్ పరామర్శ

- ఇటీవల కన్నుమూసిన వైసీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్
- ఒంగోలులో కాకుమాను నివాసానికి వెళ్లిన జగన్
- కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా

**అమరావతి :** వైసీపీ అధినేత జగన్ ఈరోజు ఒంగోలులో పర్యటించారు. ఇటీవల మరణించిన పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఒంగోలులోని రాజశేఖర్ నివాసానికి వెళ్లిన జగన్, ఆయన కుటుంబ సభ్యులను కలిసి సానుభూతిని తెలియజేశారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.కాగా, విజయవాడలో సెప్టెంబర్ 21న డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ - మిగతా 2 లో

## చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు



- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం ప్రారంభం
- రూ.1.30 లక్షల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామన్న పవన్
- గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల వేగంతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడి
- రూ.11,085 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, పండ్ల తోటల నిర్మాణం
- అభివృద్ధి పనుల నాణ్యతను ప్రజలే పర్యవేక్షించాలని పిలుపు

**అమరావతి :** రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో చేపట్టిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. రామాపురంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, - మిగతా 2 లో

## గడ్డపార చేతబట్టి... డొంక రోడ్డుకు శ్రీకారం చుట్టి




- కొకులవారిపల్లి శ్రమదానం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- శ్రమదానంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్
- వీబీ జీ రాంజీ శ్రామికులతో కలసి పొలాల మధ్యకు డొంక రోడ్డుకు శ్రీకారం
- కాలినడకన పల్లెపండుగ అభివృద్ధి పనుల పరిశీలన
- పూల జల్లులతో స్వాగతించిన గ్రామస్తులు
- కొత్త రోడ్లపై గ్రామంలోకి నడిచి వెళ్లిన చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, శ్రీ మాధవ్
- గ్రామ సచివాలయం వద్ద వీబీ జీ రాంజీ శ్రామికులతో కలసి గ్రూప్ ఫొటో

**నెల్లూరు :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ గడ్డపారలు చేత పట్టి వీబీ జీ రాంజీ పనులను ప్రారంభించారు. కొత్త డొంక రోడ్డుకు శ్రీకారం చుట్టారు. పల్లెపండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా కొకులవారిపల్లి గ్రామంలో పొలాల మధ్యకు నిర్మించతలపెట్టిన డొంక రోడ్డుకు శ్రమదానం చేశారు. గడ్డపారలతో ముగ్గురు నేతలు - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఓ నిశ్శబ్ద సంక్షోభం!



భారత్ భవిష్యత్‌లో ఎదుర్కొనే అతిపెద్ద సవాలు ఏమిటి? నిరుద్యోగం, కృత్రిమ మేధ, వాతావరణ మార్పు, నీటికొరత--ఇవన్నీ మాట్లాడుకుంటున్నాం. కానీ మరో సంక్షోభం గురించి చర్చ జరగడం లేదు-- అదే సంరక్షణ కొరత----కేర్ డెఫిసిట్. పిల్లలను చూసుకునేవారు, వృద్ధులకు తోడుగా ఉండేవారు తగ్గిపోతున్నారు. ఇప్పటివరకు ఈ బాధ్యతను మహిళలే మోశారు. కానీ ఉమ్మడి కుటుంబాలు కరిగిపోతున్నాయి, మహిళల ఉపాధి పెరుగుతోంది. సంరక్షణ అవసరం పెరుగుతుంటే, తీర్చాల్సిన కుటుంబాలు చిన్నవవుతున్నాయి. ఒక మహిళ తన పిల్లల కోసం ఉద్యోగం వదిలేస్తే, ఆమె నైపుణ్యం, ఆదాయం, స్వంత జీవితం-- అంతా ఆగిపోతుంది. ఈ నష్టం ఆమె కుటుంబానికి, పనిచేసే సంస్థకు, చివరికి దేశానికి కూడా చెందుతుంది.భారత టైమ్ యూజ్ సర్వే ప్రకారం, మహిళలు రోజుకు అయిదు గంటలు వేతనం లేని పని చేస్తారు. ఇది ఇంటి పని. పిల్లల, వృద్ధుల సంరక్షణ సమయం వేరే. ఈ పనిని ఎవరూ లెక్కవేయలేదు, ఎందుకంటే అది 'బాధ్యత' అనుకుంటారు. ఈ 'బాధ్యత' ఆర్థిక విలువ ఎంత? మహిళల ఉచిత గృహ, సంరక్షణ శ్రమ విలువ భారత జీడీపీలో 15 నుంచి 17శాతం-- అంటే రూ.34 లక్షల కోట్లకు పైగా ఉంటుందని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ అంచనా. మహిళా శ్రామికశక్తి భాగస్వామ్యంలో ఉన్న అంతరాన్ని పూడిస్తే 2025 నాటికి భారత జీడీపీకి సుమారు రూ.64 లక్షల కోట్లు జతకావొచ్చని మెకిన్సే గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ అంచనా. సంరక్షణ భారం తగ్గితే, దేశ ఆర్థిక వ్యవస్థ ఎంత పెరుగుతుందో ఈ రెండు గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పుడు ప్రపంచ సంస్థలు కూడా ఇదే చెబుతున్నాయి. కేర్ సేవల్లో పెట్టుబడి పెడితే మహిళల ఉపాధి పెరుగుతుంది, ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. భారత ఆర్థిక సర్వే దీన్ని భారీ ఉపాధి రంగంగా పేర్కొంది; సుప్రీంకోర్టు కూడా సంరక్షణను దేశ నిర్మాణంలో కీలక భాగంగా చెప్పింది. ఈ సంక్షోభం భారత్‌కు మాత్రమే పరిమితం కాదు. అభివృద్ధి చెందిన దేశాలు కూడా ఇదే సవాలును ఎదుర్కొంటున్నాయి. జర్మనీలో వృద్ధుల సంరక్షణ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది. ఆ వృద్ధుల పిల్లల వార్షిక ఆదాయం లక్ష యూరోలు దాటితేనే, వారి నుంచి కొంత ఆర్థిక సహకారాన్ని ప్రభుత్వం తీసుకుంటుంది.భారత్ కూడా తన మార్గాన్ని కనుగొనాల్సిన సమయం ఆసన్నమైంది. 2050 నాటికి భారత జనాభాలో దాదాపు 20శాతం మంది వృద్ధులు ఉంటారు. వారి సంరక్షణకు మూడు కోట్ల శిక్షణ పొందిన సిబ్బంది అవసరమని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి అంచనా. రాబోయే దశాబ్దాల్లో భారత్ ఎంత పెద్ద సంరక్షణ మౌలిక వసతిని నిర్మించాల్సి ఉంటుందో ఈ సంఖ్యే చెబుతోంది. ప్రపంచంలోని అనేక దేశాలు కేర్ ఎకానమీని సంక్షేమ కార్యక్రమంగా కాకుండా ఉపాధి, మహిళల ఆర్థిక భాగస్వామ్యం, వృద్ధుల సంక్షేమం, ఆరోగ్య వ్యవస్థలను కలిపే అభివృద్ధి వ్యూహంగా చూస్తున్నాయి. భారత్ కూడా అదే దిశగా అడుగులు వేయాలి. రేపటి సంక్షోభం ఉద్యోగాలు లేకపోవడం వల్ల మాత్రమే కాదు, ఉద్యోగం చేయాలనుకున్న వారిని కాపాడుకునే వ్యవస్థ లేకపోవడం వల్ల కూడా రావొచ్చు. దీన్ని నివారించాలంటే, సంరక్షణను కుటుంబ వ్యక్తిగత బాధ్యతగా కాకుండా, విద్య, ఆరోగ్యం లాగే మౌలిక సదుపాయంగా మార్చాలి.

# గడ్డపార చేతబట్టి డొంక రోడ్డుకు శ్రీకారం చుట్టి

మొదటిపేజీ తరువాయి - మట్టిని తవ్వగా, ఆ గ్రామానికి చెందిన వీబీ జీ రాంజీ శ్రామికులు గంపలతో మట్టిని ఎత్తి రోడ్డు పోశారు. పల్లెపండుగ 3.0 కార్యక్రమంలో డొంక రోడ్లకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. పైలట్ ప్రాజెక్టు కింద గ్రామీణ ప్రాంతాలు ఉన్న 167 నియోజకవర్గాల పరిధిలో నియోజక వర్గానికి ఒక్కటి చొప్పున డొంక రోడ్డు నిర్మించనుండగా, ఉదయగిరి నియోజకవర్గం పరిధిలో కొకులవారిపల్లి గ్రామంలో నిర్మించతలపెట్టిన డొంక రోడ్డు పనులను శ్రమదానం ద్వారా ముఖ్యమంత్రివర్యులు, ఉపముఖ్యమంత్రి ప్రారంభించారు. అంతకు ముందు కొకులవారిపల్లి గ్రామంలో పల్లెపండుగ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను ముగ్గురు నేతలు కాలినడకన పరిశీలించారు. గ్రామ సరిహద్దుల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టె స్వాగతం పలుకగా, గ్రామంలోకి వేసిన బీటీ రోడ్డు, గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు, రోడ్డుకి సమీపంలో ఉన్న మినీ గోకులాన్ని పరిశీలించారు. రోడ్డు నాణ్యతను తనిఖీ చేశారు. సుమారు కిలోమీటరు మేర కాలినడకన కొకులవారిపల్లి గ్రామ సచివాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ వీబీ జీ రాంజీ శ్రామికులతో కలసి గ్రూప్ ఫొటో దిగారు.అంతకు ముందు తమ గ్రామానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,పీవీఎన్ మాధవ్‌కు కొకులవారిపల్లి గ్రామానికి చెందిన మహిళలు గ్రామ సరిహద్దుల నుంచి పూల జల్లులతో స్వాగతం పలికారు. మహిళలతో ముచ్చటిస్తూ, సమస్యలు అడిగి తెలుసుకుంటూ ముగ్గురు నేతలు గ్రామంలోకి నడిచి వెళ్లారు.

### వేదికపై నడుస్తూ చేస్తూ.. ప్రజలకు అభివాదం

అంతకు ముందు పల్లెపండుగ 3.0 కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సభా వేదికపైకి విచ్చేసిన ముఖ్యమంత్రివర్యులు, ఉప ముఖ్యమంత్రివర్యులకు ప్రజలు అద్భుత స్వాగతం పలికారు. తమ మెడల్లోని కండువాలు గాల్లో ఊపుతూ, జయజయధ్వానాలు పలుకుతూ నేతలను స్వాగతించారు. ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మాధవ్ గారు వేదిక వద్ద ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై నడుస్తూ ప్రజలకు అభివాదం చేశారు. తమ అభిమాన నేతల్ని చూసి మహిళలు సైతం ఆనందంతో చిందులు వేశారు. ఫోన్లలో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. వేదికపై పల్లెపండుగ కార్యక్రమానికి పూర్వం గ్రామాల్లో పరిస్థితులు, పల్లెపండుగ తర్వాత అభివృద్ధిని వివరిస్తూ చేసిన వీడియో ప్రజెంటేషన్ సభికుల్ని ఆకట్టుకుంది.పవన్ కళ్యాణ్ గారిపై అభిమానం చాటుకున్న ఉదయగిరి ప్రజలుదపల్లెపండుగ 3.0కి తమ నియోజకవర్గాన్ని ఎంపిక చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్‌కళ్యాణ్ గారిపై ఉదయగిరి ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. జనసేన జెండా రంగులతో కూడిన గొడుగులతో వెల్కమ్ టూ పవన్ కళ్యాణ్ సర్ అంటూ.. ఆంగ్ల అక్షరమాలిక రూపాన నిలబడి కృతజ్ఞతలు తెలియజేశారు.

# చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు

మొదటిపేజీ తరువాయి - ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. రాబోయే సంవత్సరాల్లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ద్వారా రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రూ.1.30 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని ప్రకటించారు.ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ పాలనతో ప్రస్తుత కూటమి ప్రభుత్వ పనితీరును పవన్ కళ్యాణ్ పోల్చిచూపారు. "వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే, మేము కేవలం రెండేళ్లలోనే దానికి పది రెట్లు ఎక్కువగా దాదాపు 9,000 కిలోమీటర్లకు పైగా పూర్తి చేశాం. వారు 304 మినీ గోకులాలు నిర్మిస్తే, మేము 30,000కు పైగా నిర్మించాం. 304 ఎక్కడ, 30,000 ఎక్కడో ప్రజలు ఆలోచించాలి" అని అన్నారు. సీఎం చంద్రబాబు దార్శనికత, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు.'పల్లె పండుగ 3.0' కార్యక్రమాన్ని రూ.11,085 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభిస్తున్నట్లు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఇందులో కేంద్రం వాటా రూ.5,400 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,700 కోట్లు భరిస్తోందని వివరించారు. ఈ నిధులతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, వెయ్యి కిలోమీటర్ల డ్రైన్లు, గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండలు వంటి అనేక పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత, వలసల సమస్య కారణంగానే ఉదయగిరిని ఈ కార్యక్రమానికి వేదికగా ఎంచుకున్నామని స్పష్టం చేశారు.ఉదయగిరి నియోజకవర్గానికి మహర్దశ పట్టబోతోందని పవన్ కళ్యాణ్ అన్నారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి గతంలో నిలిచిపోయిన సుజలా స్రవంతి పథకాన్ని రూ.52 కోట్లతో పునరుద్ధరించి 381 పనులు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. ఉదయగిరి కోటకు వెళ్లేందుకు రూ.2.5 కోట్లతో రహదారి మంజూరు చేస్తున్నామని, అటవీ అనుమతులు త్వరగా పొందేలా అధికారులను ఆదేశిస్తున్నామని తెలిపారు. ఉదయగిరి కోటను హెరిటేజ్, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు సమీకరిస్తామని వెల్లడించారు.అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. "మీ గ్రామంలో జరుగుతున్న పనులను ప్రజలు తమవిగా భావించి పర్యవేక్షించాలి. కాంట్రాక్టర్లు నాణ్యతగా పనిచేస్తున్నారా లేదా అని గమనించాలి. లోపాలు కనిపిస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అవసరమైతే సోషల్ ఆడిట్ నిర్వహిస్తాం. వెచ్చించే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలి" అని కోరారు.రైతుల కోసం డొంక రోడ్ల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభిస్తున్నామని, గిరిజన ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పవన్ కళ్యాణ్ వివరించారు. ఈ కార్యక్రమానికి అపూర్వ స్వాగతం పలికిన ప్రజలకు, విజయవంతం చేసిన అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# దేశవ్యాప్తంగా 16 ప్రాంతాల్లో ఎన్ఐఏ సోదాలు

మొదటిపేజీ తరువాయి - చెందిన ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపింది. అరెస్టు అయిన వారి వద్ద నుంచి ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లతో సహా అనేక పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. IMK పన్నిన ఉగ్రవాద కుట్రకు సంబంధించి 11 మంది నిందితులపై ఎన్ఐఏ అభియోగాలు నమోదు చేసిన మూడు నెలల తర్వాత సోదాలు నిర్వహించింది. అసోంలోని బార్‌పేట జిల్లాల్లో, ఆజాద్ నగర్ నిచుకా ప్రాంతాల్లోని పలు చోట్ల ఎన్ఐఏ సోదాలు నిర్వహించింది. విచారణ కోసం అస్సాంలోని బార్పేట జిల్లాకు చెందిన ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపింది. అరెస్టు అయిన వారిని సోర్భోగ్‌కు చెందిన ఫరూక్ అబ్దుల్లా, జాకీర్ హుస్సేన్, చాంద్‌బార్ అలీ, బార్పేట రోడ్‌కు చెందిన ముస్తఫిజుర్ రెహమాన్, నిషకాకు చెందిన యాకూబ్ అలీ, హౌలీలోని జషిహతిపరా గ్రామానికి చెందిన రకీబుల్ ఇస్లాంలుగా గుర్తించారు. ఈ ఆపరేషన్ సమయంలో అనేక కీలకమైన పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నారు.మరోవైపు బంగాల్‌లోని దక్షిణ దినాజ్‌పూర్ జిల్లా కుష్మారి ముందేహర్ గ్రామానికి చెందిన ముజిబుర్ రెహమాన్ (26) ఇంటిపై 'జమాత్-ఉల్-ముజాహిదీన్' ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో దర్యాప్తు అధికారులు సోదాలు నిర్వహించారు. ముజిబుర్ ఇంటికి దూరంగా ఉండి చదువుకుంటుండగా, జనవరిలో పోలీసులు తమ ఇంటికి వచ్చి అతడి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారని అతడి తండ్రి మిజానూర్ రెహమాన్ చెప్పారు. అప్పటి నుంచి ముజిబుర్ పరారీలో ఉన్నాడు. ప్రస్తుతం అతడి ఆచూకీ గానీ, కార్యకలాపాల గురించి గానీ ఎవరికీ తెలియదు. ఎన్ఐఏ వర్గాల సమాచారం ప్రకారం, ముజిబుర్‌కు ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే, నిందితుడి కుటుంబ సభ్యులు, స్థానికులు మాత్రం, అతడు తన ఉన్నత చదువులతో పాటు పరీక్షకు కూడా సన్నద్ధమవుతున్నాడని అంటున్నారు. గత జనవరి వరకు అతడు ఇంట్లోనే ఉన్నప్పటికీ, ఆ తర్వాత అతడి ఆచూకీ లేకుండా పోయింది. సుమారు ఏడు లేదా ఎనిమిది నెలల క్రితం పోలీసులు అతడి నివాసంలో సోదాలు నిర్వహించినట్లు స్థానిక వర్గాలు తెలిపాయి. బంగాల్, అసోం, త్రిపురతో సహా ఈశాన్య రాష్ట్రాల్లో ఉగ్రవాద భావజాలాన్ని విస్తరించేందుకు IMK పన్నిన కుట్రలో నిందితులు చురుకుగా పాల్గొన్నట్లు ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. ఈ కుట్రలో ఉగ్రవాద సంస్థ ఎజెండాను ప్రచారం చేయడం, భారతదేశంలో ఆ సంస్థ నెట్‌వర్క్‌ను విస్తరించడం లక్ష్యంగా పెట్టుకు ంది. గువాహటిలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన ఛార్జ్‌షీ ట్‌లో నిందితులపై 'భారతీయ న్యాయ సంహిత- 2023', చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం- 1967'లోని వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.భారత్‌లో నిషేధిత సంస్థ జేడీవీ దుర్మార్గపు ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి, ఆ సంస్థకు చెందిన సీనియర్ సభ్యుడు ఇమామ్ మహమూద్ హబీబుల్లా 'IMK'ని స్థాపించినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. రహస్య సమావేశాలు, మతపరమైన భావజాల ప్రచారం, తీవ్రవాద సాహిత్యాన్ని పంపిణీ, నాయకత్వానికి మద్దతుగా భారత్‌కు వ్యతిరేకంగా డిజిటల్ వేదికల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఈ మార్గాల ద్వారా భారతదేశంలో ఉనికిని విస్తరించడానికి ఈ 11 మంది నిందితులు కుట్ర పన్నినట్లు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు.

# వైసీపీ నేత కాకుమాను కుటుంబానికి జగన్ పరామర్శ

మొదటిపేజీ తరువాయి - వైసీపీ చేపట్టిన నిరసనలో జరిగిన తోపులాట అనంతరం రాజశేఖర్ అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిందే. రాజశేఖర్ గతంలో లిడ్‌క్యాప్ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు.

# ఆసియా క్రీడల్లో భారత్ కు మరో స్వర్ణం

మొదటిపేజీ తరువాయి - రామ్‌రాజ్‌లతో కూడిన భారత జట్టు 3 నిమిషాల 29.69 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని అగ్రస్థానంలో నిలిచింది. ఈ విజయంతో గత ఆసియా క్రీడల్లో సాధించిన రజతాన్ని భారత్ స్వర్ణంగా మార్చుకుంది.రేసు ఆరంభం నుంచి భారత్ పతకం కోసం తీవ్రంగా పోటీపడింది. తొలి ల్యాప్‌లో పరుగెత్తిన కిరణ్ పహల్ మూడో స్థానంలో బ్యాటన్‌ను అందించగా, రెండో ల్యాప్‌లో అనుభవజ్ఞురాలైన పూవమ్మ వేగాన్ని పెంచి భారత్‌ను పోటీలో ముందుకు తెచ్చింది. ఇప్పటికే వ్యక్తిగత 400 మీటర్ల విభాగంలో కాంస్యం గెలుచుకున్న ప్రాచి, మూడో ల్యాప్‌లో అదే ఊపును కొనసాగించి పతకాన్ని ఖాయం చేసే స్థితిలో నిలిపింది.ఇక చివరిదైన యాంకర్ లెగ్‌లో విద్యా రామ్‌రాజ్ తన సత్తా చాటింది. బహ్రెయిన్ అథ్లెట్ సల్వా ఈద్ నాసర్ నుంచి తీవ్రమైన పోటీ ఎదురైనప్పటికీ, విద్యా ఏమాత్రం ఒత్తిడికి లోనుకాలేదు. చివరి 200 మీటర్లలో తనదైన శైలిలో స్ప్రింట్ చేసి, ఆధిక్యాన్ని కాపాడుకుంటూ విజయ రేఖను దాటింది. దీంతో భారత శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ పోరులో బహ్రెయిన్ 3:30.21 సెకన్లతో రజతం, చైనా 3:31.02 సెకన్లతో కాంస్యం గెలుచుకున్నాయి.ఈ ఆసియా క్రీడల్లో విద్యా రామ్‌రాజ్‌కు ఇది మూడో పతకం కావడం విశేషం. ఇప్పటికే 400 మీటర్ల హర్డిల్స్‌లో రజతం, మిక్స్‌డ్ రిలేలో కాంస్యం గెలుచుకున్న ఆమె, తాజాగా రిలే జట్టుకు స్వర్ణం అందించడంలో కీలక పాత్ర పోషించి బంగారు ముగింపు పలికింది. కొన్ని దశాబ్దాల నాటి జాతీయ రికార్డును బద్దలు కొట్టిన మరుసటి రోజే ఆమె ఈ ఘనత సాధించడం గమనార్హం. 4ఇ400 మీటర్ల రిలేలో బలమైన చరిత్ర ఉన్న భారత్, ఈ విజయంతో మరోసారి తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.

# భారత రైల్వేలో సరికొత్త ప్రయోగం పట్టాలెక్కిన తొలి ఎల్ఎన్‌జీ రైలు




మొదటిపేజీ తరువాయి - షా ఈ రైలును జెండా ఊపి ప్రారంభించారు. సబర్మతి నుంచి మెహసానా మధ్య ఈ రైలు తన తొలి ప్రయాణాన్ని పూర్తిచేసుకుంది.ఈ రైలు ఎనిమిది కోచ్‌లు కలిగిన డీజిల్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ (డీఈఎంయూ) ర్యాక్. దీని ప్రత్యేకత డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్‌తో పనిచేయడం. ఈ రైలుకు ఉన్న రెండు 1,400 హార్స్‌పవర్ సామర్థ్యం గల డ్రైవింగ్ పవర్ కార్లను (ఇంజిన్లు) డీజిల్‌తో పాటు ఎల్ఎన్‌జీతో కూడా నడిచేలా మార్పులు చేశారు. ఇంధన లభ్యత, అవసరాన్ని బట్టి డీజిల్ లేదా ఎల్ఎన్‌జీల మధ్య ఇంజిన్‌ను మార్చుకునే సౌలభ్యం దీనిలో ఉంది. ప్రతి పవర్ కారులో 2,200 లీటర్ల సామర్థ్యమున్న ప్రత్యేక ఇన్సులేటెడ్ ఎల్ఎన్‌జీ ట్యాంక్‌ను అమర్చారు. ఇది అత్యంత శీతల ఉష్ణోగ్రతల్లో ఇంధనాన్ని సురక్షితంగా నిల్వ చేస్తుంది.ఈ డ్యూయల్ ఫ్యూయల్ విధానం ద్వారా డీజిల్ వాడకాన్ని దాదాపు 40 శాతం వరకు తగ్గించవచ్చని రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు. ట్రయల్ రన్స్‌లో వెల్లడైన వివరాల ప్రకారం, ఒక్కో డ్రైవింగ్ పవర్ కారుకు ఏటా సుమారు రూ.11.9 లక్షల వరకు ఇంధన ఖర్చు ఆదా అయ్యే అవకాశం ఉంది. ఈ రైలును అధికారికంగా ప్రారంభించడానికి ముందు 2,000 కిలోమీటర్లకు పైగా క్షేత్రస్థాయిలో విజయవంతంగా పరీక్షించారు.అయితే, ఎల్ఎన్‌జీ కూడా శిలాజ ఇంధనమే కావడంతో ఇది పూర్తిస్థాయిలో కాలుష్యరహిత రైలు కాదు. కానీ, విద్యుదీకరణ పూర్తికాని మార్గాల్లో డీజిల్ వాడకాన్ని, నిర్వహణ ఖర్చులను తగ్గించడం, కర్బన ఉద్గారాలు, నైట్రోజన్ ఆక్సైడ్‌ల విడుదలను నియంత్రించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఇటీవల ప్రవేశపెట్టిన హైడ్రోజన్ రైలుకు, ఈ ఎల్ఎన్‌జీ రైలుకు సాంకేతికంగా కీలకమైన వ్యత్యాసం ఉంది. హైడ్రోజన్ రైలులో ఫ్యూయల్ సెల్స్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నడిపిస్తే, ఈ ఎల్ఎన్‌జీ రైలులో మాత్రం సంప్రదాయ ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్‌నే డ్యూయల్ ఫ్యూయల్ కోసం మార్పులు చేసి వినియోగిస్తున్నారు.

# నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా

మొదటిపేజీ తరువాయి - పార్టీ అధినేతనే తప్పుబడుతున్నారని మండిపడ్డారు. తనతో పెట్టుకోవద్దని, నిర్దిష్టమైన ఆధారాలతో అన్ని విషయాలు బయటపెడతానని హెచ్చరించారు.నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సీఎం అని కేసీఆర్ చెప్పడం వల్లే సమస్యలు తమ వరకు రాలేదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కవిత 'ఎక్స్' వేదికగా స్పందించారు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్లు పార్టీ వైఫల్యాలను కేసీఆర్‌పై మోపుతున్నారని విమర్శించారు. ఇలా చేస్తూ బీఆర్ఎస్‌కు గోతులు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.తాను బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఓ అవినీతి వ్యక్తిని విమర్శిస్తే కొన్ని గంటల్లోనే సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అలాంటిది ఇప్పుడు అదే వ్యక్తితో కలిసి ఉంటూ, కేసీఆర్ తీరుతోనే పార్టీకి నష్టం జరిగిందని బహిరంగంగా వ్యాఖ్యానించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ప్రశ్నించారు. పార్టీ అధినేతను, ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను బహిరంగంగా తప్పుబట్టడం ఏంటని నిలదీశారు.ఫామ్‌హౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన అనుమతులు, ఆంధ్రా స్నేహితులకు ఇచ్చిన ప్రయోజనాలు, క్విడ్ ప్రో కో వ్యవహారాలతో బీఆర్ఎస్‌ను పాతాళంలోకి నెట్టింది మీరే అంటూ కేటీఆర్‌పై కవిత ఆరోపణలు చేశారు. ఇటీవల బీఆర్ఎస్ సమావేశంలో ఓ రైతు ఫోన్‌లో మాట్లాడుతుంటే ఆయన భార్యను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. సాయం కోరుతూ వచ్చిన మహిళతోనూ అనుచితంగా మాట్లాడారని మండిపడ్డారు.గణేశ్ నిమజ్జనోత్సవంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను ఎంతమందిని బతిమాలుకున్నారో గణేశుడికి, వారి అంతరాత్మకు తెలుసని కవిత వ్యాఖ్యానించారు. తాను విషనాగుల మాటలు విని మాట్లాడనని, నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడతానని స్పష్టం చేశారు. తనతో పెట్టుకోవద్దని హెచ్చరిక జారీ చేశారు.

# క్యూర్ పరిధిలో మరో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన

మొదటిపేజీ తరువాయి - గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రులు లబ్ధిదారులకు ఫ్లాట్లు కేటాయింపు పత్రాలు అందజేశారు. గత ప్రభుత్వం మాదిరి నగరానికి దూరంగా కాకుండా వందల కోట్ల రూపాయలు విలువ చేసే ప్రముఖ ప్రాంతాల్లో అద్భుతమైన టవర్లు నిర్మించి పేదలకు ఇస్తున్నామని పొంగులేటి చెప్పారు.గత ప్రభుత్వం పది సంవత్సరాల్లో ఇళ్లు నిర్మించామని గొప్పలు చెప్పుకుంటున్నారు. ఈ మొదటి విడతలోనే ఆ ప్రభుత్వం కట్టిన దానికంటే రెట్టింపు ఇండ్లను నిర్మించి చూపిస్తాను. మొదటి విడతలోనే నేను కట్టి చూపిస్తే మరి నువ్వు రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వస్తావా? లేకుంటే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉంటావా అని అడగగా దానికి కేటీఆర్ దగ్గర సమాధానం లేదు. పదేళ్లలో నిజంగానే ఇండ్లు నిర్మించి ఉంటే ఈనాడు రాష్ట్రంలో హైదరాబాద్? పట్టణంలో నాంపల్లి నియోజకవర్గంలో పేదవారి ఇళ్ల కళ ఇలా ఉండేది కాదు.పేద ప్రజల జీవిత కళ సాకారం చేసేందుకు, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమం చేపట్టామని పొంగులేటి వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఉచితంగా చేస్తామని మంత్రులు తెలిపారు. భవిష్యత్తులో వాటిపై పిల్లల చదువులు, పెళ్లిళ్ల అవసరాలకు లోన్లు కూడా తీసుకోవచ్చని సూచించారు.

# అదుపుతప్పి మాట్లాడితే మహిళలతో కొట్టిస్తా

మొదటిపేజీ తరువాయి - కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇష్టానుసారం మాట్లాడితే మహిళలతో చిత్తుచిత్తుగా కొట్టిస్తాం. ఒక్కో మహిళ నలుగురిని కొడుతుంది, జాగ్రత్త. ప్రతిపక్ష నేతలు గాలిలో కత్తులు తిప్పుతున్నారు" అంటూ ఆమె ధ్వజమెత్తారు. కొందరు నేతలు తమ హద్దులు మీరుతున్నారని, అలాంటి వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.అదే సమయంలో పార్టీ అంతర్గత పరిణామాలపైనా ఆమె స్పందించారు. కాంగ్రెస్ నేతలంతా విభేదాలను పక్కన పెట్టి, పార్టీ బలోపేతం కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులంతా ఐక్యంగా ఉంటేనే పార్టీ ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని ఆమె సూచించారు.

# బొల్లారం ఆయుధాల చోరీ కేసులో కీలక పరిణామం



మొదటిపేజీ తరువాయి - బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ కేసు దర్యాప్తులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ హవల్దార్ మల్లేశ్‌కు ఆయుధాగారం ఇన్‌చార్జ్‌లు సహకరించినట్లు విచారణలో తేలింది. దీంతో వెపన్స్ గోడౌన్ కీపర్లు వినోద్, శేషులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వినోద్, శేషులు ఆయుధాల చోరీలో మల్లేశ్‌కు సహకరించినట్లు పోలీసులు ఆధారాలు గుర్తించారు. మల్లేశ్‌తో వారికి భారీగా ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు సాంకేతిక ఆధారాల ద్వారా నిర్ధారణకు వచ్చారు. దీంతో ఈ కేసు దర్యాప్తును పోలీసులు మరింత వేగవంతం చేశారు.మల్లేశ్ నివాసంలో ఇప్పటికే పోలీసులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పలు కీలకమైన ఆర్మీ ఆయుధాలు, బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం మల్లేశ్‌ను 10 రోజుల పోలీసు కస్టడీలో విచారిస్తున్నారు.దర్యాప్తులో భాగంగా సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ కోసం మల్లేశ్‌ను నేరుగా మద్రాస్ రెజిమెంట్‌కు తీసుకెళ్లారు. ఈ కేసులో మరిన్ని వివరాలను పోలీసులు త్వరలో వెల్లడించే అవకాశం ఉంది.

# మహిళా ఎమ్మెల్యేలతో దురుసు ప్రవర్తన

**ఆ పోలీసులను గుర్తించాలన్న తెలంగాణ హైకోర్టు**

**దురుసుగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించాలని డీజీపీకి హైకోర్టు ఆదేశం**

**సంబంధిత పోలీసుల వివరాలను స్పీకర్‌కు సమర్పించాలని సూచన**

**వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉందని వ్యాఖ్యానించిన కోర్టు**

**సెప్టెంబర్ 7న అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనపై బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ**



తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని రాష్ట్ర డీజీపీని హైకోర్టు ఆదేశించింది. మంగళవారం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆ అధికారుల వివరాలను సేకరించి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సమర్పించాలని డీజీపీ సీవీ ఆనంద్‌కు సూచించింది.సెప్టెంబర్ 7న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటి రోజున ఈ ఘటన చోటుచేసుకుంది. నల్ల టీ-షర్టులు ధరించి నిరసన తెలిపేందుకు వెళుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ఎమ్మెల్యేలకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ ఘటనలో తమ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అమర్యాదగా ప్రవర్తించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, బాధ్యులైన అధికారులపై అసెంబ్లీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉంటుందని స్పష్టం చేసింది. ఒక మహిళా ఎమ్మెల్యే చీర లాగారని, మాజీ హోంమంత్రిగా పనిచేసిన మరో మహిళా ఎమ్మెల్యేను మెడ పట్టుకుని నెట్టారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.శాసనసభ్యులను అసెంబ్లీలోకి వెళ్లకుండా నిలువరించే హక్కు పోలీసులకు లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకోవాల్సింది స్పీకర్ మాత్రమేనని సెప్టెంబర్ 8నే హైకోర్టు తేల్చి చెప్పిన విషయం విదితమే. మరోవైపు, ఈ ఘటనకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై కేసులు నమోదయ్యాయి. అయితే, తాము ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసులు నమోదు చేయలేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ ఇప్పటికే జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌తో పాటు గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేసింది.

## జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన వెల్లుల్ల విద్యార్థిని



**మెట్టుపల్లి సెప్టెంబర్ 29 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా మరియు ఎస్.ఎస్.కరాటే జిమ్నాస్టిక్ అకాడమీ నల్గొండ వారి ఆధ్వర్యంలో శివంజనేయ గార్డెన్ నల్గొండలో ఆదివారం నాడు జరిగిన 11వ తెలంగాణ స్టేట్ కరాటే ఛాంపియన్ షిప్ వారియర్స్ కప్ -2026 పోటీలలో మెట్టుపల్లి మండలం వెల్లుల్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థి జిల్లా.నిత్య వర్ధిని కటాసు మరియు కుమిటే రెండు విభాగాలల్లో "రాష్ట్ర స్థాయి" లో "రెండవ" స్థానం సాధించి, నవంబర్ లో హైదరాబాద్ లో జరిగే "జాతీయ స్థాయి కరాటే "పోటీలకు ఎంపికైనట్లు వెల్లుల్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.విద్యార్థినికి మెరిట్ సర్టిఫికెట్స్ , సిల్వర్ మెడల్స్ అందజేసినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గూడూరు తిరుపతి, ఉప సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పోచంపల్లి లక్ష్మి,,వ్యాయమ ఉపాధ్యాయులు కొమురయ్య,పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.ద

## పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యానికి కౌన్సిల్ ప్రాధాన్యత చైర్పర్సన్ సమిండ్ల వాణి



**జగిత్యాల, సెప్టెంబర్ 29 (ప్రజా మంటలు):** జగిత్యాల పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ అధ్యక్షతన సెప్టెంబర్ నెల కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరిగింది. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పారిశుద్ధ్య సేవలు, ప్రజా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చైర్‌పర్సన్ తెలిపారు.సమావేశంలో ఇటీవల మృతి చెందిన మున్సిపల్ కార్మికులు చాంద్ ఖాన్, కొండ్ర రవీందర్, రిటైర్డ్ ఉద్యోగి అవారి ఆనందం మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.పట్టణంలోని వివిధ వార్డుల్లో సీసీ రోడ్ల ప్యాచ్‌వర్క్ పనులకు రూ.50 లక్షలు కేటాయించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. బతుకమ్మ, దసరా పండుగల ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాల పనులు, శానిటేషన్ వాహనాల మరమ్మతులకు రూ.4 లక్షలు కేటాయించేందుకు నిర్ణయించారు.మున్సిపల్ షాపులను అద్దెకు/లీజుకు ఇచ్చేందుకు నిబంధనల ప్రకారం టెండర్ ప్రక్రియ చేపట్టి మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చాలని నిర్ణయించారు. అలాగే వివిధ ప్రాంతాల్లో భూముల వినియోగ మార్పు ప్రతిపాదనలను నిబంధనల ప్రకారం పరిశీలించి ఉన్నతాధికారుల అనుమతులకు పంపేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.కౌన్సిలర్లు తమ వార్డుల్లోని ప్రజా సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురాగా, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు.సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ జీనత్ పర్వీన్ మునీరుద్దీన్, మున్సిపల్ కమిషనర్ కె. సత్యప్రణవ్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్, ఎన్‌పీడీసీఎల్, ఐసీడీఎస్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ద

## రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా సిరిసిల్ల శ్రీనివాస్ ఏకగ్రీవం



**జగిత్యాల సెప్టెంబర్ 29 (ప్రజా మంటలు):** జిల్లా కమిటీ చైర్మన్ గా డా.ఏ. శ్రీనివాస్ రెడ్డి , వైస్ చైర్మన్ గా శ్రీమతి భీమానాతిని ఉమాదేవి, కోశాధికారిగా పి.నరేందర్ గౌడ్ జగిత్యాల జిల్లా , సీనియర్ జర్నలిస్ట్, రోటరీ క్లబ్ అంతర్జాతీయ సంస్థ జగిత్యాల లో రెండుసార్లు ప్రెసిడెంట్‌గా, అసిస్టెంట్ గవర్నర్‌గా, ప్రాజెక్ట్ చైర్మన్ గా సేవలందించిన సిరిసిల్ల శ్రీనివాస్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ నెల 24న ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ముగిసింది. ఇందులో 15 మంది సభ్యులకు 15 మంది మాత్రమే నామినేషన్లు రావడంతో ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. జిల్లా కలెక్టరేట్ లో రెడ్ క్రాస్ ఎన్నికల అధికారి సి హెచ్ మనోజ్ కుమార్ జగిత్యాల శాఖకు 15 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించిన నేపథ్యంలో, ఈ 15 మంది సభ్యులనుండి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా జర్నలిస్ట్ సిరిసిల్ల శ్రీనివాస్, జిల్లా కమిటీ చైర్మన్ గా డా.ఏ. శ్రీనివాస్ రెడ్డి , వైస్ చైర్మన్ గా శ్రీమతి భీమానాతిని ఉమాదేవి, కోశాధికారిగా పి.నరేందర్ గౌడ్ లు మాత్రమే ఒక్కొక్క నామినేషన్ వేయడంతో, కమిటీ ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి మనోజ్ కుమార్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అందజేసిన శు భాకాంక్షలు తెలిపారు

## వెంకటాపూర్‌లో వాటర్ హార్వెస్టింగ్ పాండ్ పనులు ప్రారంభం



**వెల్గటూర్, సెప్టెంబర్ 29 (ప్రజా మంటలు):** వెల్గటూర్ మండలం వెంకటాపూర్ గ్రామంలో వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా ఎదీ+ =ూవీ + పథకంలో భాగంగా వాటర్ హార్వెస్టింగ్ పాండ్ పనులను సోమవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ బిళ్లకూరి తిరుపతి, ఉపసర్పంచ్ అల్లం శ్రీనివాస్ పనులకు శ్రీకారం చుట్టారు.పాండ్ ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయడంతో భూగర్భ జలాలు పెరగడంతో పాటు గ్రామంలోని నీటి వనరులను సంరక్షించేందుకు దోహదపడుతుందని వారు తెలిపారు. అలాగే పశువులు, పక్షులకు నీటి వసతి కల్పించడంలోనూ ఈ పాండ్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పుదారి ప్రసాద్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మెరుగు ఆంజనేయులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు జీవిత నైపుణ్యాలు, మానసిక వికాసంపై శిక్షణ




**జగిత్యాల సెప్టెంబర్ 29 (ప్రజా మంటలు):** ధరూర్ క్యాంపులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జీవిత లక్ష్యాలు, మానసిక వికాసం, మానవతా విలువలు, విద్యా నైపుణ్యాలు, జీవిత నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ముఖ్య అతిథి దురిశెట్టి కిరణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, ఎన్ని కష్టాలు ఎదురైనా గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువులు గర్వపడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.సైకాలజిస్ట్ గాలిపెల్లి నాగేశ్వర్ విద్యార్థులకు మానసిక శక్తి, లక్ష్య సాధనపై సూచనలు అందించారు. లీడ్ ఇండియా స్టేట్ ట్రైనింగ్ మేనేజర్ తాడూరి శ్రీనివాస్ ఆచార్య పర్యవేక్షణలో చదవడం, రాయడం, పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం, జీవిత నైపుణ్యాలు, తల్లిదండ్రులు--గురువుల పట్ల గౌరవం, మానవతా విలువలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.స్పీకర్లు తిరుపతిరావు, రామకృష్ణారావు మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థుల ప్రవర్తన, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని, మానవతా విలువలను పాటిస్తూ జీవితంలో ఉన్నతంగా ఎదగాలని సూచించారు.పాఠశాల హెచ్ఎం అమర్‌నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు, మానసిక వికాసం, మానవతా విలువలను పెంపొందించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, అనూజ, గంగయ్య, షకీల్, పవన్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కొంగరకుర్దు భూములపై కాంగ్రెస్, బిఆరెస్ ల కబ్జా-కవిత ఆరోపణలు

### రైతుల భూములను కాపాడాలని డిమాండ్..

### 2022 తర్వాతి రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని కోరిన కవిత




**హైదరాబాద్ సెప్టెంబర్ 29 (ప్రజా మంటలు)::** కొంగరకుర్దు-ఏ గ్రామంలోని భూముల విషయంలో రైతులకు న్యాయం చేయాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గ్రామ భూ బాధితులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె పలు ఆరోపణలు చేశారు.కొంగరకుర్దులో సర్వే నంబర్లు 2 నుంచి 400 వరకు ఉన్న సుమారు 580 ఎకరాల భూమి వక్ఫ్ బోర్డుకు చెందిందని 2007లోనే గెజిట్ ద్వారా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని కవిత పేర్కొన్నారు. ఈ భూముల్లో సుమారు 150 ఎకరాలు భూ మాఫియా చేతుల్లోకి వెళ్లిపోయాయని ఆరోపించారు.2022లో కొన్ని మీడియా సంస్థలు తొలుత భూ వ్యవహారంపై వార్తలు ప్రచురించి, అనంతరం వాటిపై కథనాలు నిలిపివేశాయని ఆమె విమర్శించారు. ఈ విషయంలో బీఆర్ఎస్ నాయకత్వం సమాధానం చెప్పాలని సవాల్ చేశారు.కొంగరకుర్దు భూముల విషయంలో తన సంతకాలు ఫోర్జరీ చేశారని ఓ ఐఏఎస్ అధికారి ప్రభుత్వానికి లేఖ రాసినట్లు కూడా కవిత పేర్కొన్నారు. నర్సమ్మకు చెందిన భూమికి లక్ష్మి పేరుతో ఓఆర్సీ తీసుకున్నారంటూ మరో ఉదాహరణను ప్రస్తావించారు.కొంగరకుర్దు రైతులకు ప్రభుత్వం రక్షణ కల్పించి, భూముల రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని, అక్రమంగా జరిగినట్లు తేలిన రిజిస్ట్రేషన్లపై చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు.

## టీఆర్ నగర్‌లో ఘనంగా ఓర్సు దినోత్సవం

### ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్




**జగిత్యాల సెప్టెంబర్ 29 (ప్రజా మంటలు):** జగిత్యాల పట్టణంలోని టీఆర్ నగర్‌లో ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో ఓర్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు, ముస్లిం మైనార్టీ సోదరులకు ఓర్సు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు సోదరభావం, ఐకమత్యంతో పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. టీఆర్ నగర్‌లో జీవో 59 కింద 116 మంది నిరుపేదలకు పట్టాలు అందించామని, దాదాపు 200 మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. టీఆర్ నగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.శాంతి, సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవంతో జగిత్యాల మరింత అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గజంగి నందయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మాజీ వైస్ చైర్మన్ మన్సూర్, కౌన్సిలర్లు చాంద్ పాషా, లావణ్య రాజేందర్, పద్మ రాజేందర్, స్వప్న గిరిధర్, పవిత్ర మహేష్, మమత రామకృష్ణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జెల్ల రవీందర్, కార్యక్రమ నిర్వాహకుడు సద్దాం హుస్సేన్, కోటగిరి మోహన్, మెన్నెనీ ప్రవీణ్ రావు, ముస్లిం మైనార్టీ నాయకులు, మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## బిజెపి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్ ఈ డి కార్యాలయ ముట్టడి అడ్డుకున్న పోలీసులు





**జగిత్యాల సెప్టెంబర్ 29 (ప్రజా మంటలు) :** బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు క్రాంతి కిరణ్ పిలుపుమేరకు జిల్లా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కార్యాలయం ముట్టడికి యత్నించగా పోలీసులు అడ్డుకోవడాన్ని ఎస్సిమోర్చా నాయకులు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బడ్జెట్లో కాగితాల మీద మాత్రమే బడ్జెట్ ఉంటుందని లబ్ధిదారుల ఖాతాలోకి రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి పైసా లబ్ధిదారుల ఖాతాలోకి చేరాలని లేనట్లయితే బిజెపి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మెడలు వంచి ఎస్సీ సామాజిక వర్గానికి నిధులు సమకూర్చడంలో బాధ్యత తీసుకుంటుందని అన్నారు. రాబోయే రోజుల్లో ఎస్సీలకు అందించాల్సిన నిధులు అందకపోతే బిజెపి ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అదేవిధంగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసే యత్నంలో పోలీసులు అడ్డుకొని దిష్టిబొమ్మను స్వాధీనం చేసుకున్నారు .ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు పట్టణ అధ్యక్షుడు కాసెట్టి తిరుపతి ఎస్సీ మోర్చా నాయకులు నారపాక అశోక్ చంద్రశేఖర్ ఆముదరాజు బిజెపి నాయకులు తదితరులు ఉన్నారు.

## కేటీఆర్‌కు దళితులు, బలహీనవర్గాల సంక్షేమం పట్టలేదు

### సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలి: మంత్రి లక్ష్మణ్ కుమార్



**సిరిసిల్ల, సెప్టెంబర్ 29 (ప్రజా మంటలు):** సిరిసిల్ల నియోజకవర్గంలో దళితులు, బడుగు బలహీనవర్గాల సంక్షేమాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ పట్టించుకోలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. ఈ నెల 30న సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే పాదయాత్ర, బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్ విజయరమణారావుతో కలిసి పరిశీలించారు.అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. 2014 నుంచి 2023 వరకు కేటీఆర్ మంత్రిగా పనిచేసినప్పటికీ సిరిసిల్లలో దళితులు, బలహీనవర్గాల సమస్యలు పూర్తిగా పరిష్కారం కాలేదని అన్నారు. కరకట్ట, సివరేజ్ ప్లాంట్ నిర్మాణం కారణంగా దళితులకు అసైన్డ్ చేసిన సుమారు 300 ఎకరాల భూములు సాగుకు నోచుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 30న భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు

## గౌరవెల్లి కెనాల్ భూ నిర్వాసితుల ఖాతాల్లో నష్టపరిహారం జమ:

### హనుమకొండ ఆర్‌డీఓ ఎన్. వెంకటేష్



**భీమదేవరపల్లి:సెప్టెంబర్ 29ప్రజా మంటలు ):** గౌరవెల్లి ప్రాజెక్ట్ కెనాల్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు సంబంధించిన నష్టపరిహార మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు హనుమకొండ ఆర్‌డీఓ ఎన్.వెంకటేష్ తెలిపారు.మంగళవారం భీమదేవరపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గౌరవెల్లి కెనాల్ భూములను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ...కెనాల్ పరిధిలో భూములు కోల్పోయిన మెజారిటీ రైతుల ఖాతాల్లో ఇప్పటికే పరిహారాన్ని జమ చేశామని స్పష్టం చేశారు.మల్లారం,వంగర గ్రామాల శివారులోని భూములను పరిశీలించిన ఆయన, సదరు రైతులకు రావాల్సిన నష్టపరిహారాన్ని కూడా త్వరలోనే ఖాతాల్లో జమయ్యేలా వేగవంతమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి తహశీల్దార్ బి.రాజేష్,ఇరిగేషన్ ఈఈ స్వామి,డీఈ చైతన్యతో పాటు పలువురు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**జగిత్యాల, సెప్టెంబర్ 29(ప్రజా మంటలు) :** గోదావరి పుష్కరాలు--2027 నేపథ్యంలో జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లపై మంగళవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో ధర్మపురి, కోటిలింగాల, వెల్గటూర్, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, బీర్పూర్, రాయికల్ మండలాల పరిధిలోని గోదావరి తీర ప్రాంతాల్లో పుష్కర ఘాట్లను అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పుష్కరాల సందర్భంగా జిల్లాలో సుమారు 2.40 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు.పుష్కరాల ఏర్పాట్ల కోసం వివిధ శాఖలకు కలిపి రూ.220.41 కోట్ల నిధులు మంజూరైనట్లు వివరించారు. ఇరిగేషన్, ఎండోమెంట్స్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ప్రజారోగ్యం, నీటి సరఫరా--పారిశుధ్యం, పర్యాటకం తదితర శాఖల ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు.ధర్మపురి ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునరుద్ధరణకు రూ.10 కోట్లు, కోటిలింగాల ఆలయ పునరుద్ధరణకు రూ.10 కోట్లు మంజూరై పనులు ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. కోటిలింగాల ఆలయ పునరుద్ధరణలో భాగంగా పాత ఆలయ కూల్చివేత పనులు పూర్తయ్యాయని వివరించారు.భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఘాట్ల వద్ద పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, అత్యవసర సేవలకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వైద్య శిబిరాలు, పారిశుధ్య సిబ్బంది, తాగునీరు, విద్యుత్, రహదారులు, పార్కింగ్ తదితర అన్ని అంశాల్లో శాఖల మధ్య సమన్వయం ఉండాలని అధికారులకు సూచించారు. ప్రతి శాఖకు కేటాయించిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు.ఈ సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్, ఆర్డీవోలు, కలెక్టరేట్ ఏవో కిషన్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు,తహసీల్దార్ లు, ఎంపిడివోలు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## భీమదేవరపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సానగంటి వెంకటేశ్వర్లు



**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 29 (ప్రజా మంటలు):** భీమదేవరపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా సానగంటి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు, మండల పార్టీ అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షుడిగా పోలు కోటేశం, ప్రధాన కార్యదర్శిగా మారూపాటి శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శులుగా తాళ్లపెల్లి శ్రీనివాస్, ఎల్కపెల్లి శ్రీనివాస్, క్యాషియర్‌గా చేరాల సదానందం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పోలు అశోక్ ఎన్నికయ్యారు.నూతన అధ్యక్షుడు సానగంటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## టీబీ నిర్మూలనలో మీడియా పాత్ర కీలకం

### సికింద్రాబాద్ లో టీబీ వ్యాధిపై వర్క్షాప్




**సికింద్రాబాద్,సెప్టెంబర్ 29 (ప్రజామంటలు):** క్షయ (టీబీ) వ్యాధి నిర్మూలనలో, ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ప్రసార మాధ్యమాల పాత్ర ఎంతో కీలకమని వైద్య నిపుణులు స్పష్టం చేశారు. టీబీ అలర్ట్ ఇండియా ఆధ్వర్యంలో క్యాప్-డీఆర్టీబీ ప్రాజెక్టులో భాగంగా సికింద్రాబాద్ లో మంగళవారం "టీబీపై సంవాదం" పేరిట మీడియా ప్రతినిధులతో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. సుమారు 30 మంది పాత్రికేయులు హాజరైన ఈ కార్యక్రమంలో మందులకు లొంగని టీబీ (డీఆర్-టీబీ) తీవ్రత, దాని నివారణోపాయాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఐఈసీ అధికారి జితేందర్, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ శ్రీగణ తదితరులు మాట్లాడుతూ... టీబీ వ్యాధి లక్షణాలు, వ్యాప్తి, ముందస్తు పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో టీబీ నిర్ధారణ పరీక్షలతో పాటు సంపూర్ణ చికిత్స, మందులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. డీఆర్-టీబీ, ఎండీఆర్-టీబీ, ఎక్స్‌డీఆర్-టీబీ వంటి సంక్లిష్ట దశల నుంచి పూర్తిగా కోలుకోవాలంటే వైద్యుల పర్యవేక్షణలో క్రమం తప్పకుండా మందులు వాడి, నిర్దేశిత కోర్సును పూర్తి చేయాలని సూచించారు.కార్యక్రమంలో పాల్గొన్న ఐదుగురు టీబీ విజేతలు (ఛాంపియన్లు) తాము వ్యాధి బారిన పడిన నాటి నుంచి కోలుకునే వరకు ఎదుర్కొన్న సవాళ్లను మీడియాతో పంచుకున్నారు. రోగుల ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేలా మానవీయ కోణంలో వార్తా కథనాలు అందించాలని, బాధితుల గోప్యతను కాపాడుతూ ప్రభుత్వ ఉచిత సేవలపై విస్తృత ప్రచారం కల్పించాలని నిర్వాహకులు కోరారు. సమాజంలో టీబీపై నెలకొన్న భయాలు, అపోహలు, వివక్షను రూపుమాపడంలో మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ సదస్సులో డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ శ్రీగణ, రాష్ట్ర ఐఈసీ అధికారి జితేందర్, మెడికల్ ఆఫీసర్ (టీయూ) డాక్టర్ అరవింద్, టీబీ అలర్ట్ ఇండియా ప్రోగ్రామ్స్ హెడ్ డి. రమేష్, ఎంఅండ్ఈ ఆఫీసర్ బాలకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ సత్యప్రసాద్, ఫీల్డ్ సిబ్బంది శ్యామల, భవాని, తులసి తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల ఐఎంఏ నూతన కార్యవర్గం



**జగిత్యాల సెప్టెంబర్ 29 (ప్రజా మంటలు):** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జగిత్యాల శాఖ నూతన కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ శశికాంత్ రెడ్డి అధ్యక్షులుగా, డాక్టర్ రమేష్ చింత జనరల్ సెక్రటరీగా, డాక్టర్ వాసాల శ్రీధర్ కోశాధికారిగా ఎన్నికయ్యారు.నూతన కార్యవర్గం ఐఎంఏ జగిత్యాల శాఖ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు వైద్యుల సంక్షేమం, ప్రజారోగ్యానికి సంబంధించిన అంశాలపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

## సికింద్రాబాద్ మెడికవర్‌లో ఘనంగా 'వరల్డ్ హార్ట్ డే'..

### ఉచిత గుండె వైద్య శిబిరం ప్రారంభం



**సికింద్రాబాద్,సెప్టెంబర్ 29 ( ప్రజామంటలు):** ప్రపంచ హృదయ దినోత్సవం (వరల్డ్ హార్ట్ డే) సందర్భంగా ప్రజల్లో గుండె ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు సికింద్రాబాద్‌లోని మెడికవర్ హాస్పిటల్స్‌లో మంగళవారం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న ప్రజలకు ఉచితంగా రక్తపోటు (బీపీ), ఈసీజీ పరీక్షలను నిర్వహించి, అనంతరం కార్డియాలజీ నిపుణులు తగిన వైద్య సలహాలను అందించారు. గుండె సంబంధిత సమస్యలు, అధిక రక్తపోటు, ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఎదురయ్యే ఇబ్బందులపై ప్రముఖ వైద్యులు ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించారు.ప్రతి ఒక్కరూ గుండె ఆరోగ్య పరిరక్షణపై అప్రమత్తంగా ఉండాలని, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని మాజీ కార్పొరేటర్ దీపికా సూచించారు.ఈ సందర్భంగా చీఫ్ ఆఫ్ కార్డియాలజీ, డైరెక్టర్ డాక్టర్ ప్రమోద్ కుమార్ కుచులకంటి మాట్లాడుతూ, ఒకప్పుడు కేవలం వృద్ధుల్లోనే కనిపించిన గుండె జబ్బులు నేడు యువతలో కూడా వేగంగా విస్తరిస్తుండటం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. మానసిక ఒత్తిడి, జీవనశైలి లోపాలు, శారీరక శ్రమ లేకపోవడం, మధుమేహం, బీపీ వంటి కారణాలే ఇందుకు దారితీస్తున్నాయన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, రోజువారీ వ్యాయామంతో పాటు ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉంటే గుండె జబ్బుల ముప్పును తగ్గించవచ్చని స్పష్టం చేశారు. ముందస్తు పరీక్షల ద్వారా వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి నివారించవచ్చని ఆయన తెలిపారు.ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎన్. శివ ప్రసాద్ నాయుడు, డాక్టర్ సాగర్ చంద్రశేఖర్ భుయార్, డాక్టర్ వినోద్ వాద్య, డాక్టర్ కె. సాకేత్, డాక్టర్ ప్రదీప్ కుమార్ మిశ్రా, డాక్టర్ శ్రీనివాస్ రావు దూసాతో పాటు సెంటర్ హెడ్ కృష్ణవేణి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వివేకానందరెడ్డి హత్య కేసు - సునీల్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు

'వివేకాను అంతమొందించాల్సిన అవసరం నాకు లేదు, ఈ హత్య వల్ల నాకు ఎలాంటి లాభమూ లేదు, ఆయన బతికుంటేనే లాభపడేవాణ్ని అన్న సునీల్ యాదవ్. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యతో లబ్ధి పొందింది వైఎస్సార్సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలని ఈ కేసులో రెండో నిందితుడు యాదటి సునీల్ యాదవ్ వెల్లడించారు. హత్య ద్వారా లబ్ధి పొందిన వారిని వదిలేసి కేవలం తమను మాత్రమే విచారిస్తే ప్రయోజనమేంటని ప్రశ్నించారు. జగన్, భారతిని వెంటనే నిందితులుగా చేర్చి, హత్య వెనకున్న వారి కుట్రలను వెలికితీసేలా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. వివేకా బతికుంటే కచ్చితంగా కడప ఎంపీ అయ్యేవారని, దీన్ని బట్టే ఆయన్ను ఎందుకు అడ్డు తొలగించుకున్నారో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. సునీల్ యాదవ్ సోమవారం ఓ మీడియా ఛానల్‌తో మాట్లాడుతూ సంచలన విషయాలు బయటపెట్టారు.'వివేకాను చంపించిన వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిల వెనక ఉన్నది జగన్, భారతిలే. వివేకాను ఎవరు చంపించారు, కుట్ర ఎవరు చేశారు, ఈ హత్యతో ఎవరు లబ్ధి పొందారన్నది పులివెందులలో



చిన్నపిల్లోడిని అడిగినా చెబుతారు. ఈ వివరాలన్నీ ఈడీ విచారణలో వివరించా. వివేకా హత్య ద్వారా లబ్ధి పొందిన వారిని బయటకు తీసి ఉరిశిక్ష విధించాలని కోరాను' అని సునీల్ యాదవ్ చెప్పారు. 'వివేకాను అంతమొందించాల్సిన అవసరం నాకు లేదు. ఈ హత్య వల్ల నాకు ఎలాంటి లాభమూ లేదు. ఆయన బతికుంటేనే లాభపడేవాణ్ని. యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి నాకు ఇప్పించేవాడు. నా పేరు ఒక బ్రాండ్‌గా మారుండేది' అని సునీల్ యాదవ్ వెల్లడించారు.నాకు రక్షణ కల్పించండి: 'జగన్, భారతి, అవినాష్‌రెడ్డిల వల్ల నా ప్రాణాలకు ముప్పు ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నాకు రక్షణ కల్పిస్తే నేను ప్రాణాలతో ఉంటాను. ఈ కేసునూ బతికించగలను. నాకు రక్షణ కల్పించాలని ఇప్పటికే వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీని, కర్నూలు రేంజ్ డీఐజీని, డీజీపీని కోరాను. హోంమంత్రిని కూడా కలుస్తా. ఈ కేసుకు సంబంధించిన నిజానిజాలన్నీ చెప్పేస్తా. నాకు రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులను వేడుకుంటున్నా.వివేకా హత్య కేసుల్లో నాలుగేళ్ల పాటు జైల్లో ఉండి బయటకొచ్చిన తర్వాత అప్పట్లో అవినాష్‌రెడ్డి మనుషులు లోకేశ్‌రెడ్డి, పవన్‌కుమార్‌లు నాపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇలాంటి ఘటనలు మూడు జరిగాయి. వీటిపై పులివెందుల పోలీసుస్టేషన్‌లో కేసులూ నమోదయ్యాయి. ఈ కేసులో కీలక సాక్షులైన గంగాధరరెడ్డి, వాచ్‌మన్ రంగన్న సహా పలువురు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అందుకే నాకు రక్షణ కల్పించాలి. ఈడీ విచారణకు పూర్తిగా సహకరించా' అని సునీల్ యాదవ్ చెప్పారు

# తిరుపతి - తిరుచ్చి విమానాశ్రయాలు ప్రైవేటీకరణకు సిద్ధం

తిరుపతి, తిరుచిరాపల్లి విమానాశ్రయాలను కేంద్రం ప్రైవేటీకరించనుంది. నిర్వహణ, అభివృద్ధి బాధ్యతలు ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రకటనను జారీ చేసింది.తిరుపతి, తిరుచిరాపల్లి విమానాశ్రయాలను కేంద్రం ప్రైవేటీకరించనుంది. నిర్వహణ, అభివృద్ధి బాధ్యతలు ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని ఏఏఐ (ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటనను జారీ చేసింది. ఎయిర్‌పోర్ట్‌లో ప్రయాణికుల రద్దీ, ప్రత్యేక సదుపాయాల ఏర్పాటు దృష్ట్యా బండ్లింగ్ చేయాలని నిర్ణయించింది. మరో రెండు విమానాశ్రయాలను ప్రైవేటు పరం చేసే పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.అంతర్జాతీయ విమానాశ్రయంతో బండ్లింగ్ : తిరుపతి విమానాశ్రయాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు ఆపరేటర్‌కు అప్పగించనుంది. తమిళనాడులోని తిరుచిరాపల్లి అంతర్జాతీయ విమానాశ్రయంతో బండ్లింగ్ చేసి ప్రైవేటీకరించనున్నారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా పరిధిలోని 11 విమానాశ్రయాల నిర్వహణ, అభివృద్ధి బాధ్యతలను ప్రైవేటు సంస్థకు అప్పగించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటనను ఏఏఐ జారీ చేసింది. ప్రైవేటుకు అప్పగించడం ద్వారా ఎయిర్‌పోర్ట్ ఆధునికీకరించడంతో పాటు మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయడం, ఆదాయాన్ని పెంచుకోవాలన్నది ఏఏఐ లక్ష్యం. ఇటీవల కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ అప్రైజల్ కమిటీ సమావేశంలో మొదటిసారి రెండు విమానాశ్రయాలను బండ్లింగ్ చేసి ప్రైవేటుకు అప్పగించాలని నిర్ణయించింది. ఒక అత్యంత రద్దీ ఉన్న విమానాశ్రయంతో తక్కువ రద్దీ ఉన్న విమానాశ్రయాన్ని బండ్లింగ్ చేయాలని పీపీపీఏసీ నిర్ణయించింది. 11 విమానాశ్రయాలను ఐదు బండిల్స్‌గా విభజించి లీజుకు ఇవ్వాలన్న పౌర విమానయానశాఖ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. 2020లో అహ్మదాబాద్, లక్నో, మంగళూరు, గువాహటీ, తిరువనంతపురం విమానాశ్రయాల నిర్వహణను ప్రైవేటుకు ఏఏఐ అప్పగించింది. ఇప్పుడు మొదటి సారి బండ్లింగ్ విధానంలో ఎయిర్‌పోర్ట్‌లను ప్రైవేటుకు అప్పగించాలని నిర్ణయించింది.పర్యాటకుల సంఖ్య పెరుగుతుండటంతో : తిరుపతి ప్రైవేటుకు ఎందుకంటే తిరుమలకు వచ్చే భక్తులు, పర్యాటకుల సంఖ్య పెరుగుతుండటంతో విమానాశ్రయంలో రద్దీ పెరుగుతోంది. ప్రస్తుతం తిరుపతి నుంచి హైదరాబాద్, బెంగళూరు, దిల్లీ, ముంబయి వంటి ప్రధాన నగరాలతో పాటు రాష్ట్రంలోని విజయవాడ, విశాఖకి రోజూ విమాన సర్వీసులు నడుస్తున్నాయి. ప్రయాణికుల రద్దీ, భూమి లభ్యత, వాణిజ్య సామర్థ్యం, ఆర్థిక పనితీరు, ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యేక సదుపాయాలను పరిగణనలోకి తీసుకుని డేటా ఆధారిత విశ్లేషణ ద్వారా కేంద్రం విమానాశ్రయాలను బండ్లింగ్ చేయాలని నిర్ణయించింది. తిరుపతి విమానాశ్రయాన్ని తిరుచిరాపల్లితో కలపడం ద్వారా కొత్త పెట్టుబడుల ఆకర్షణ,



నిర్వహణ సామర్థ్యం, వాణిజ్యపరంగా అభివృద్ధి వేగవంతం అవుతుందని అంచనా. ట్రాఫిక్ పెరిగే కొద్దీ అభివృద్ధి పనులను ప్రైవేటు సంస్థ చేపట్టాల్సి ఉంటుంది.పరిశీలనలో రాజమహేంద్రవరం, కడప : రాష్ట్రంలో ఏఏఐ నిర్వహణలో ఉన్న రాజమహేంద్రవరం, కడప విమానాశ్రయాలనూ బండ్లింగ్ విధానంలో అప్పగించే ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. రాజమహేంద్రవరంలో 173.28 కోట్లతో డొమెస్టిక్ టెర్మినల్, ఇతర మౌలిక సదుపాయాల పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. కడపలో 210.61 కోట్లతో చేపట్టిన పనుల్లో ఇప్పటికి సుమారు 70 శాతం పూర్తయ్యాయి. సర్వీసులు, ప్రయాణీకుల సంఖ్య పెరిగిన తర్వాత బండ్లింగ్ విధానంలో ప్రైవేటుకు అప్పగించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# అక్టోబర్ 11 నుంచి విజయవాడ ఉత్సవ్ 2 పోస్టర్ విడుదల చేసిన మంత్రులు

విజయవాడ ఉత్సవ్ పోస్టర్‌ను మంత్రులు దుర్గేశ్, సత్యకుమార్ ఆవిష్కరించారు. విజయవాడ ఉత్సవ్ రెండో సీజన్ నిర్వహించుకోబోతున్నామని తెలిపారు. విజయవాడ ఉత్సవ్ తరహా ఉత్సవాలను రాష్ట్రం నలుమూలలా జరపాలనుకుంటున్నామన్నారు.రాష్ట్రంలోని మరుగునపడిపోతున్న కళలను ప్రోత్సహించడానికి, సంస్కృతిని పరిరక్షించడానికి విజయవాడ ఉత్సవ్ తరహా కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ నలుమూలలా నిర్వహిస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ప్రకటించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి ఆయన విజయవాడ ఉత్సవ్ రెండో సీజన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అక్టోబర్ 11 నుండి అక్టోబర్ 20 వరకు తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా జరగనున్న ఈ ఉత్సవాలకు దేశవ్యాప్తంగా ఉన్న ముఖ్యమంత్రులను ఆహ్వానించినట్లు మంత్రి వెల్లడించారు.రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా 'విజయవాడ ఉత్సవ్' రెండో సీజన్‌ను ఎలాంటి ఆటంకాలు లేకుండా అత్యంత వైభవంగా నిర్వహించడమే తమ లక్ష్యమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన అధికారిక పోస్టర్‌ను మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభ కార్యక్రమంలో మంత్రి దుర్గేశ్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. పునరుజ్జీవనానికి చక్కని వేదిక: మరుగునపడిపోతున్న ప్రాచీన కళల ప్రదర్శనకు, స్థానిక కళాకారుల ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు విజయవాడ ఉత్సవ్ వంటి వేదికలు ఎంతో దోహదపడతాయని మంత్రి పేర్కొన్నారు. ఇటువంటి




ఉత్సవాల నిర్వహణ ద్వారా మన గొప్ప కళలు, సంస్కృతిని భవిష్యత్తు తరాలకు అందించవచ్చన్నారు జీవనోపాధికి పెద్దపీట: ఈ ఉత్సవాలు కేవలం వినోదానికే పరిమితం కాకుండా, ఆర్థిక పురోభివృద్ధికి కూడా తోడ్పడతాయని మంత్రి వివరించారు. ఉత్సవాల కాలంలో చిన్న తరహా వ్యాపారులు, ఆటో-రిక్షా డ్రైవర్లతో పాటు విభిన్న వర్గాల ప్రజలకు విస్తృత వ్యాపార అవకాశాలు లభిస్తాయని, తద్వారా వారి జీవనోపాధి మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు."విజయవాడ ఉత్సవాల రెండవ విడతను ఎలాంటి ఆటంకాలు లేకుండా వైభవంగా నిర్వహించాలనే లక్ష్యంతో, ఈరోజు మేము ఒక ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించాం. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న 'వైబ్రెంట్ విజయవాడ' సొసైటీకి, ఈ చొరవకు నాయకత్వం వహిస్తున్న పార్లమెంట్ సభ్యులకు (ఎంపీ) నేను ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ కూడా సహకరిస్తోంది. ఇటువంటి ఉత్సవాలను నిర్వహించడం మన గొప్ప కళ, సంస్కృతిని పరిరక్షించడమే కాకుండా, స్థానిక ప్రతిభను ప్రదర్శించడానికి ఒక వేదికను కూడా అందిస్తుంది. ఈ తొమ్మిది రోజుల ఉత్సవానికి మేము దేశవ్యాప్తంగా ఉన్న ముఖ్యమంత్రులను ఆహ్వానించాం. వారి హాజరు, ఈ కార్యక్రమం ప్రత్యక్ష అనుభవం, ఈ విషయాన్ని వ్యాప్తి చేయడానికి దాని మరింత అభివృద్ధికి మార్గం సుగమం చేయడానికి సహాయపడతాయి" - కందుల దుర్గేశ్, మంత్రిముఖ్యమంత్రి దార్శనికతతో ముందుకు : ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల ఆవశ్యకతను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తరచుగా నొక్కి చెబుతుంటారని, ఆయన దార్శనికతను స్వీకరించి గత ఏడాది కూడా ఈ ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించామని గుర్తు చేశారు. ఈ ఏడాది మరింత అద్భుతంగా నిర్వహించడానికి 'వైబ్రెంట్ విజయవాడ' సొసైటీ, స్థానిక పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) చొరవ చూపడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి ఏపీ పర్యాటక శాఖ పూర్తి సహకారాన్ని అందిస్తోందని స్పష్టం చేశారు.దేశవ్యాప్త ముఖ్యమంత్రులకు ఆహ్వానం: మొత్తం తొమ్మిది రోజుల పాటు సాగే ఈ ఉత్సవానికి దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించినట్లు మంత్రి దుర్గేశ్ వెల్లడించారు. వారు ఈ కార్యక్రమానికి హాజరై, ఇక్కడి ప్రత్యక్ష అనుభవాన్ని పంచుకోవడం ద్వారా విజయవాడ ఉత్సవ్ ఖ్యాతి దేశమంతటా వ్యాపిస్తుందని, భవిష్యత్తులో ఈ వేడుకల మరింత అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

## లొంగిపోయిన మావోయిస్టుల్లో కేసుల ఆందోళన

# ఝీరం లోయ కేసులో మరణశిక్షతో గుబులు

ఇటీవల ఛత్తీస్‌గఢ్ ఎన్ఐఏ కోర్టు 2013లో ఝీరం లోయలో జరిగిన ఘటనపై పదిమందికి ఉరిశిక్ష విధించింది. దీంతో కేసులపై ఉదారంగా వ్యవహరిస్తామన్న ప్రభుత్వాల ప్రకటనతో లొంగిపోయిన మావోయిస్టుల్లో ఇప్పుడు ఆందోళన నెలకొంది. దేశంలో మావోయిస్టుల శకం ముగిసిందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ వారిపై పెండింగ్‌లో ఉన్న కేసుల విషయంలో మాత్రం అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. దీంతో లొంగిపోయిన మావోయిస్టులను ఇప్పుడు ఒకింత ఆందోళన కలిగిస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలో 2013లో కాంగ్రెస్ నిర్వహించిన ర్యాలీపై జరిగిన దాడికి సంబంధించి పది మంది మావోయిస్టులకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కోర్టు ఇటీవల మరణశిక్ష విధించింది. దీంతో మావోయిస్టుల కేసుల అంశం మరోసారి తెరపైకి వచ్చింది.

### లొంగిపోయినవారిపై ఉదారంగా వ్యవహరిస్తాం

తాజాగా మరణశిక్ష పడిన వారిలో బర్సె సుక్కు అలియాస్ దేవా కూడా ఉన్నారు. ఈయన గత జనవరిలో తెలంగాణ పోలీసులకు లొంగిపోయారు. మరో వాంటెడ్ వ్యక్తి తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ కూడా పోలీసుల ఎదుట లొంగిపోయారు. అయితే ఇలా లొంగిపోయిన వారిపై ఉన్న కేసులకు సంబంధించి ఉదారంగా వ్యవహరిస్తామని, వారికి గౌరవప్రదమైన జీవితాన్ని కల్పిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. 29 మంది ప్రాణాలు కోల్పోయిన ఈ ఘటనలో ప్రధాన నిందితుడైన దేవాకు ఇప్పుడు మరణశిక్ష పడటం చర్చకు తెరలేపింది.

### తెలుగు మూలాలు ఉన్నవారున్నారు

మావోయిస్టు పార్టీ మాజీ కార్యదర్శి గణపతితో పాటు పోలీసు ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయిన కార్యదర్శి నంబాళ్ల కేశవరావు సహా చాలా మంది అగ్రశ్రేణి మావోయిస్టు నాయకులు తెలుగు మూలాలు కలిగినవారే. అయితే దేశంలో ఎక్కడైనా మావోయిస్టులకు సంబంధించిన ఘటన జరిగినప్పుడల్లా వీరిపై కేసులు నమోదయ్యేవి. ఛత్తీస్‌గఢ్ ఎన్ఐఏ కోర్టు ఇచ్చిన తాజా తీర్పు కూడా ఈ కోవకే చెందుతుంది. గతంలో జరిగిన ఓ దాడికి సూత్రధారిగా ఉన్న బర్సె దేవాకు మరణశిక్ష విధించగా తిప్పరి తిరుపతిని కోర్టు 'వాంటెడ్'గా పేర్కొంది.



### దర్యాప్తు సంస్థల నిర్ణయమేంటో!

దేవా, దేవ్‌జీ తెలంగాణ పోలీసులకు లొంగిపోవడం గమనార్హం. మరణశిక్ష పడిన దేవాతో పాటు లొంగిపోకముందే ఛార్జ్‌షీట్‌లో వాంటెడ్‌గా నమోదైన తిప్పరి తిరుపతి విషయంలోనూ దర్యాప్తు సంస్థలు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటాయనే దానిపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది. మొత్తంగా ఈ తాజా తీర్పు లొంగిపోయిన మావోయిస్టులపై పెండింగ్‌లో ఉన్న పోలీసు కేసుల అంశాన్ని మరోసారి చర్చనీయాంశంగా చేసింది.

### అసలేంటీ ఝీరం లోయ కేసు

2013 మే 25న ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలోని ఝీరమ్ వ్యాలీలోని జాతీయ రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నికల ప్రచారంలో భాగంగా పరివర్తన్ ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి తిరుగు ప్రయాణం అవుతుండగా వీరి కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు దాడి చేశారు. దాడికి పాల్పడిన వారు మొదట ఐఈడీని పేల్చి, ఆపై కాల్పులు జరపడంతో పాటు గ్రెనేడ్లను విసిరారు. ఈ దాడిలో మొత్తం 29 మంది మరణించారు. మృతుల్లో అప్పటి ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ అధ్యక్షుడు నందకుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేశ్, మాజీ కేంద్ర మంత్రి విద్యా చరణ్‌శుక్లాతో పాటు మావోయిస్టులకు వ్యతిరేకంగా సల్వా జుడుం ఉద్యమాన్ని నడిపిన పార్టీ సీనియర్ నాయకుడు మహేంద్ర కర్మ సహా ప్రముఖ నాయకులు మరణించారు.దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఝీరం లోయ మావోయిస్టు దాడి కేసుపై తాజాగా ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్‌లో ఉన్న ఎన్ఐఏ కోర్టు విచారించింది. ఈ నేపథ్యంలో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ సింగ్ రాజ్‌పుత్ ఈ నెల 5నే వారందరినీ దోషులుగా నిర్ధరించి, 16న శిక్ష ఖరారు చేశారు. మొత్తం 10 మంది నిందితులకు ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు మరణ శిక్ష విధించగా దోషుల్లో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు.

# ఎంఐఎం కొత్త ప్రధాన కార్యదర్శిగా హుస్సేన్ అన్వర్.. కీలక పదవులను భర్తీ చేసిన ఒవైసీ

**పలు కీలక సంస్థాగత పదవులను భర్తీ చేసిన అసదుద్దీన్ ఒవైసీ**

**10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ**

**మైనారిటీ స్కాలర్‌షిప్‌ల విషయంలో కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు**



ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పార్టీ నూతన ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ అబ్దుల్ హుస్సేన్ అన్వర్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ సీనియర్ నేత సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ ఈ ఏడాది ఫిబ్రవరిలో మరణించడంతో, అప్పటి నుంచి ఈ పదవి ఖాళీగా ఉంది.ప్రధాన కార్యదర్శి నియామకంతో పాటు మరికొన్ని కీలక సంస్థాగత పదవులను కూడా పార్టీ భర్తీ చేసింది. పార్టీ సంయుక్త కార్యదర్శిగా సయ్యద్ ముస్తాక్ అహ్మద్‌ను, కోశాధికారిగా మోహ్సిన్ బలాలాను నియమించారు. పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో సమద్ బిన్ అబాద్‌కు సహాయకుడిగా అబూ తల్హా అమ్జెద్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ నియామకాలన్నీ తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ వర్గాలు వెల్లడించాయి.అనంతరం, మజ్లిస్ ఛారిటీస్ ఎడ్యుకేషనల్ అండ్ రిలీఫ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఒవైసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 1,700 మంది ఉర్దూ మీడియం పదో తరగతి విద్యార్థులకు 'ఆల్-ఇన్-వన్' స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ ఏడాది తెలంగాణవ్యాప్తంగా సుమారు రూ. 65 లక్షల వ్యయంతో 8,000 'ఆల్-ఇన్-వన్' కిట్లను పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఒవైసీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను బలహీనపరుస్తోందని, స్కాలర్‌షిప్‌లను తగ్గిస్తోందని విమర్శించారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' నోటీసులు అందుకున్న వారు తక్షణమే స్పందించి, తమ వివరాలను సరిచూసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

# విశాఖలో వైద్య విద్యార్థిని శ్రావణి ఆత్మహత్య

**విశాఖలో పీజీ వైద్య విద్యార్థిని ఆత్మహత్య**

**ఆంధ్రా మెడికల్ కాలేజీ విద్యార్థిని శ్రావణిగా గుర్తింపు**

**చినవాల్తేరులోని అద్దె ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణం**

**మృతురాలు హైదరాబాద్‌కు చెందిన యువతిగా నిర్ధారణ**

**ఆత్మహత్యకు కారణాలపై కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు**



విశాఖపట్నం నగరంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఉన్నత చదువుల కోసం నగరానికి వచ్చిన ఓ వైద్య విద్యార్థిని తన జీవితాన్ని అర్ధాంతరంగా ముగించింది. ఆంధ్రా మెడికల్ కాలేజీ (ఏఎంసీ)లో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్న శ్రావణి (22) అనే యువతి సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది.వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌కు చెందిన శ్రావణి విశాఖ ఏఎంసీలో పీజీలో చేరింది. నగరంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చినవాల్తేరులో ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. సోమవారం ఉదయం ఆమె తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు.ఎస్ఐ శకుంతల ఆధ్వర్యంలో పోలీసులు పరిసరాలను పరిశీలించి, కేసు నమోదు చేశారు. శ్రావణి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్) మార్చురీకి తరలించారు. ఉన్నత భవిష్యత్తు ఉన్న వైద్య విద్యార్థిని ఇలా ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా విషాదాన్ని నింపింది.

# అధికారంలో ఉన్నా టీడీపీకి తగ్గిన ఫండ్స్ వైసీపీ విరాళాల్లో భారీ పతనం

**తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన పార్టీల విరాళాల్లో తగ్గుదల**

**2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈసీకి నివేదికలు సమర్పణ**

**గత ఏడాదితో పోలిస్తే భారీగా పడిపోయిన వైసీపీ ఫండ్స్**

**అధికారంలో ఉన్నప్పటికీ టీడీపీ విరాళాల్లోనూ తగ్గుముఖం**

**టీడీపీకి అత్యధికంగా ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి విరాళం**



ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన రాజకీయ పార్టీలైన తెలుగుదేశం (టీడీపీ), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ)లకు అందిన విరాళాలు గత ఆర్థిక సంవత్సరంలో తగ్గుముఖం పట్టాయి. ముఖ్యంగా అధికారంలోకి వచ్చినప్పటికీ టీడీపీకి విరాళాలు తగ్గగా, ప్రతిపక్ష హోదాలో ఉన్న వైసీపీకి అందిన విరాళాల్లో భారీ పతనం నమోదైంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, రూ. 20 వేలకు మించి స్వీకరించిన విరాళాల వివరాలను ఆయా పార్టీలు భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నివేదించాయి.ఈ నివేదికల ప్రకారం, 2025-26లో వైసీపీకి కేవలం రూ. 24.31 కోట్ల విరాళాలు మాత్రమే అందాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో (2024-25) ఈ మొత్తం రూ. 140.04 కోట్లుగా ఉండటం గమనార్హం. అంటే, వైసీపీకి అందిన విరాళాలు సుమారు 82 శాతం మేర క్షీణించాయి. మరోవైపు, అధికార టీడీపీకి రూ. 58.25 కోట్ల విరాళాలు రాగా, అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ. 83.03 కోట్లుగా ఉంది. అధికారంలో ఉన్నప్పటికీ తెలుగుదేశం పార్టీకి అందిన విరాళాలు కూడా దాదాపు 30 శాతం మేర తగ్గుముఖం పట్టాయి.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com